# కసాయి కరువు – చక్రవేణు

రాళ్ళసీమ పల్లె మీద ఎర్రటి ఎండ నిప్పులు కురిసినట్లు కురుస్తోంది. ఎందుకో సూరీడు పగపట్టినట్లు ఊరి మీద అగ్గి వాన చల్లుతున్నాడు. తూరుపు కొండ మీద చెట్లు మలమల మాడి ఎండిపోయాయి. గుట్టల మీద తెల్లకనిక రాళ్ళు కొలిమిలో మండినట్లు ఎర్రగా మెరుస్తున్నాయి.

యుద్ధకాలంలో శత్రువుల దాడికి భయపడి ఊరొదిలి వలసపోయిన విధంగా పల్లె పల్లె అంతా బోసిగా ఉంది. పల్లెలో ఇళ్ళ యజమాను లెవ్వరూ లేరు. పసిబిడ్డలూ, వాళ్ళ తల్లులూ, ముసలోళ్ళూ మాత్రమే ఉన్నారు. ఎండకు బయటకు రాలేక కడుపులు మాడ్చుకుంటూ వడదెబ్బకు నీరసపడి ఇళ్ళల్లో పడున్నారు.

పసుల కొట్టాలల్లో గొడ్లు గాటి దగ్గర మేతలేక కడుపు కాలిపోతుంటే ఊరంతా దద్దరిల్లేట్లు అరుస్తున్నాయి. ఊరి మధ్యలో వేప చెట్టు నిలువునా ఎండిపోయింది. ఊరంతా విషాదంలో మునిగి స్మశాన వాతావరణంలా అయింది.

మామూలుగా అయితే వేసవికాలంలో చెట్లన్నీ చిగురేసి చూసినంతవరకూ పచ్చగా వనంలా ఉండేది. ఊరిని చూస్తే వనం మధ్యలో పెళ్ళి మండపం లాగా కళకళ లాడేది. పల్లె మీద ఎంత ఎండకాసినా చురుక్కు మనకుండా భూమిమీద వెన్నెల కాసినట్టుండేది. బావుల్లోనూ, చెరువుల్లోనూ నీళ్ళు తాండవమాడుతూండేవి. ఊర్లో పిల్లోళ్ళు మధ్యాహ్నం పూట గొడ్లను చెర్లో దోలి వాటితో పా... ఈదులాడేవాళ్ళు. కాళ్ళూ, చేతులూ, కళ్ళు నొప్పులు పుట్టేవరకు దిమ్మెక్కినాక గడ్డకొచ్చి రేగిచెట్ల కింద రేగివళ్ళు ఏరుకొని తిని, మామిడి తోపుల్లోకి పోయి కోతికొమ్మచి లుగుడు ఆడి సందేలప్పుడు గొడ్లను ఇళ్ళకు తోలుకొచ్చేవాళ్ళు.

ఊళ్ళో పెద్దోళ్ళను ఆ పాతరోజుల గురించి కదిపితే చాలు- "ఆరోజు లేమైనాయో, ఆ కాలమెట్ల పోయిందో ఏ దేవుడు శాపం పెట్టాడో గాని తిరిగి మల్లా మేం ఈ కళ్లతో అట్టాంటి కాలం చూస్తామో లేదో! ఏమైనా మీరంతా దరిద్రపోళ్లు పుట్టేటప్పుడు శనిదేవుణ్ణి ఎంటేసుకోనొచ్చినార్రా!" అని అంటారు.

ఉదయం నుంచి చంద్ర నిప్పులు కురిపించి, పావం సూరీడికి విసుగేసినట్టుంది, 'ఇక చాల్లే' అనుకొని పడమటి కొండల్లోకి మెల్లగా దిగుతున్నాడు. రాళ్ళ గుట్టల నీడలు పల్లె మీదకు పాకాయి. ఇళ్ళలో వాళ్ళు బయటికొచ్చి ఆకాశంకేసి తేరిపారచూసి దీర్ఘమైన నిట్టూర్పు లిడిచారు.

పెనుగొండ అచ్చయ్య కొడుకు రాయుడు తలకు చుట్ట చుట్టుకొని నీళ్ళ కడవ నెత్తిన పెట్టుకొని ఊర్లోకొచ్చాడు. రాయుడి నెత్తిమీద నీళ్ళ కడవను చూడగానే ఊళ్ళో అమ్మలక్కలకు ప్రాణం లేచొచ్చినట్లయింది.

"ఒరే రాయుడూ నీళ్ళొస్తన్నాయా?" అంతా ఒకేసారి ఆత్రంగా అడిగారు.

"ఆ వస్తన్నాయి రెడ్డేరోళ్ళు ఇప్పుడే మోటరేసిండి. అంతా తొందరగా పరిగిండి" అందరికీ వినిపించాలని రాయుడు గట్టిగా కేకలేసి చెప్పాడు.



చుట్టుపక్కల ఎవరి బావుల్లోనూ నీళ్ళు లేవు. ఒక రడ్డేరి బావిలో మాత్రమే బోర్లో నుంచి నీళ్ళు వచ్చేది. అందుకే మోటరు ఎప్పుడు వేస్తారా అని ఎదురు చూస్తాంటారు. నీళ్ళ చుక్కన్నా తాగి ఊపిరి నిలుపుకుందామనుకొని, ఆడోళ్ళు కడవ లెత్తుకొని ఊరి వెలుపల రడ్డేరి బావి కాడికి పరుగెత్తుతూ పోతున్నారు.

అతల పితల పాతాళ్లోకం నుంచి కరెంటు మోటరు ఎగలాగుతూ ఉంటే ఊస పైపులు గుండా సన్నగా నీళ్ళు పడుతున్నాయి. ఆ నీళ్ళే ప్రాణాన్ని నిలిపే అమృతంగా పడిన నీళ్ళ చుక్కలు పడినట్టు కడవలతో పట్టుకుంటున్నారు.

తిరునాళ్ళ జనం మాదిరిగా ఆడోళ్ళంతా రడ్డేరి బావి దగ్గర పోగయ్యారు. కడవలతో వస్తున్న ఆడవాళ్ళను చూడగానే పెద రడ్డేరి సేద్యగాడికి ప్రాణాలు పోయినట్లయింది. చేల్లోకి నీళ్ళు సాగవని, సాగకుంటే పెదరెడ్డి చర్మం ఊడదీస్తాడని చెప్పి సేద్యగాడు నీళ్ళు పట్టవద్దని కేకలేస్తూ వచ్చాడు.

"పోరా, నువ్వు గాకుంటే ఆ ఎదవ దగ్గరుండావు. నీ రడ్డేరు ఊరందరి నోళ్ళూ గొట్టి అందరి సొత్తూ మింగి పాడుబతుకు బతుకుతున్నాడు. అది చాలక ఇప్పుడు మమ్మల్ని నీళ్ళు కూడా తాగొద్దంటే నిలువునా బూడ్సి పెడతాం. రానీపోనీ రడ్డేరిని చూసుకొందాం ఏమవుతుందో." కడవ రాజమ్మ ఆవేశంగా తిట్టింది. సేద్యగాడి మాటలు ఎవరూ లెక్కచేయకుండా నీళ్ళు పట్టుకుంటున్నారు.

సేద్యగాడు కోపాన్ని ఆపుకోలేకపోయాడు. "సరే అయితే మీరు నీళ్ళెట్ల పట్టుకుంటారో సూద్దాం కానీండి" అంటూ విసురుగా మోటరు ఆపడానికి ముందుకు కదిలాడు.

కడవ రాజమ్మ అతనికన్నా విసురుగా ముందుకు పరుగెత్తింది.

"అడుగు ముందుకేసినావంటే తల ఎయ్యి ముక్కలవ్వాల ధైర్యముంటే అడుగేయి" చేతిలో ఇత్తడి బిందె పైకెత్తి హెచ్చరిస్తూ నిలబడింది.

రాజమ్మ సింహం లాగ అగుపడేటప్పటికి సేద్యగాడికి ఒళ్ళు జలదరించింది. మిగతా ఆడోళ్ళు చుట్టుముట్టేటప్పటికి చేతు లెత్తి దండం పెట్టి కుప్పలా కూలబడిపోయాడు.

** ** **

"గొడ్లను అమ్మేట్టుగా ఉంటే కొంటాం. ఎవురన్నా ఇచ్చే వాళ్ళుంటే ఇయ్యండమ్మో" అంటూ చీకటి పడేటప్పుడు ఇద్దరు మనుషులు పక్కాకు నములుతూ ఊరంతా వీధి వీధికీ తిరిగి కేకలేస్తూ చెప్పి ఊరి మధ్య ఎండిపోయిన వేపమాను కింద గచ్చుబండల మీద కూర్చున్నారు.


గొడ్ల వ్యాపారస్థుల దగ్గరికి పెద్దోళ్ళు ఒక్కొక్కరే వస్తున్నారు. అప్పటికే బక్కచిక్కిన పిల్లోళ్ళు తినేవి ఏవన్నా అమ్ముతున్నారేమో అని నోరూర్చుకుంటూ వచ్చి చూసి నిరాశగా నిలబడ్డారు.

"మీదే రాజ్జెం? ఎక్కడి నుండి వస్తున్నారు నాయనా?" ఒక ముసలితాత కర్ర పట్టుకుని సొక్కుతూ సోలుతూ వచ్చాడు.

తాత పేరు తిమ్మయ్య. మంచికీ, చెడ్డకీ వివరించి చెప్పే ఊరి పెద్ద దిక్కు. తాతను ఊళ్ళో వాళ్ళంతా గౌరవిస్తారు.

"మాది బళ్లారి పక్కన జోగిపేట గాని పెద్దాయనా" వ్యాపారస్థులు చెప్పారు.

"ఈ గొడ్లను మేపుకొనేదానికే కొంటన్నారు కదు



నాయనా?"

తాత చాలా ఆశగా అడిగాడు. మన దగ్గర మేవులేక గాటి దగ్గర చావడం కన్నా, వేరేవాళ్ళ దగ్గర మేవు దొరికి కొంటామంటే అమ్మడమే మంచిదన్న ఉద్దేశం తాతది.

"మీకు తెలీకుండా మాకు మాత్రం మేవు ఎక్కడుండాది? కసాయి కోసం బెంగుళూరుకు తోలకపోతాం పెద్దయ్యా" చేసే వ్యాపారాన్ని దాచుకోకుండా వ్యాపారస్థులు ఆ మాట చెప్పగానే తాతకు కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. ఉన్న వళాన భూమి రెండుగా చీలి అందులో కూరుకుపోతున్నా ననుకున్నాడు. కాసేపటికి తెప్పరిల్లుకున్నాడు.

ఎండిపోయిన గొడ్లడొక్కలు చూసిన తాతకు ఎనలేని బాధ- వాటి చూపులు చూస్తే తాతకు పసిపిల్లలను చూసినట్లే- ఒంటి జత ఎద్దుల కాడితోనే కపిలి దోలిన రోజు, బండి మీద స్వారీ చేస్తుంటే ఎద్దుల మెడలో పట్టెడకున్న గంటలు గణగణ మోగిన శబ్దాలు. మడక దున్నిన రోజులు. దిండుమాను మీద పసిపిల్లాడిని లాగినట్టు వాటితో తను బతికిన రోజులు. అవి బతికిన రోజులూ గుర్తుకొచ్చి బొటబొటా కన్నీళ్ళు కార్చాడు.

"రాళ్ళసీమ వల్లెలో గచ్చుబండ మీద రత్నాలు, వజ్రాలు పోసి వ్యాపారస్థులు అమ్మితే పక్క రాజ్యాల రాజులొచ్చి కొనుక్కొని పోయేవాళ్ళంట. అట్లాంటి రోజులు పోయి కరువురోజు లొచ్చి మనుసులకు తిండిలేక చస్తన్నాము. గొడ్లకు మేతలేక చంపుతున్నాం. అయినా రత్నాలమ్మిన కాడ గొడ్లను అమ్ముకొనే గతివట్టింది" తాతకు పాతరోజులు మనసులో మెదులుతుంటే ఆలోచిస్తూ అలాగే నిలబడ్డాడు.

"ఏం పెద్దయ్యా, కసాయికైతే గొడ్లనమ్మరా?" వ్యాపారస్థులు అనుమానంగా అడిగారు.

తాత బాధను చూసి వ్యాపారస్థులకూ బాధగానే ఉంది కానీ వాళ్ళు మాత్రమేం చేస్తారు? వాళ్ళు కూడా బ్రతకడానికే ఆ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారస్థుల వలకరింపుతో తాత ఆలోచన నుంచి బయటపడ్డాడు.

"అమ్మకేం చేస్తాం నాయనా వాటికి మేతలేదు. నీళ్ళన్నా కడుపునిండా తాపుదామంటే లేకపోయె. భూమ్మీద చుక్కవాన లేక వీటితో పనీ లేకపోయె. చూసి చూసి కసాయికి తోలాలంటే మనసొప్పదు. బతికినన్ని రోజులూ కష్టపడి మమ్మల్ని సాకినాయి. తిరిగి ఇప్పుడు చస్తా కూడా అయ్యే నాలుగు మెతుకులు పెడతన్నాయి. ఈ పాడు మనుసులకన్నా పశువులే మేలైనట్టుంది." తాత ఎగశ్వాన పీల్చుకొని కాసేపు ఆగి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"ఊర్లో మొగోళ్ళంతా ఎక్కడికన్నా పోయి పనులన్నా చేసి నాలుగు రూకలింటికి పంపితే ఒక పూటన్నా తింటారనుకోని పొలో రామచంద్రా అంటూ భార్యాబిడ్డల్ని ఇంటికాడొదిలి పోయారు. పసిబిడ్డల్ని పస్తు చంపే దానికన్నా ఆ గోడ్లనే చంపి బిడ్డల్ని బతికిచ్చుకుంటాం. అందరిండ్లకు నేనే తీస్కపోతారాండి, గొడ్లను చూడండి. అయితే మేము ఎవురం కూడా బేరం చెప్పం. మీరే చూసి బుద్ధిపుట్టిన కాడికియ్యండి అంతేచాలు. నా మాటే అందరి మాటనుకోండి."

"సరే పెద్దయ్యా మేం మాత్రం నీ కష్టం ఉంచుకోం. ప్రతి గొడ్డు మీద నీ దళారి మాములు రెండు రూపాయలు తీసుకో. ఎన్ని గొడ్లయితే అన్నిటికీ అన్ని రూపాయలు" వ్యాపారస్థులు చెప్పారు.

"వద్దు నాయనా వద్దు. ఎంత బతుకో బతికి ఈడికొచ్చింది. తెల్లోడు పొయ్యింది చూసినా. నల్లోడొచ్చింది చూసినా. ఎవుడు పోయినా వచ్చినా ఈ రాజ్జెంలో కరువు మాత్రం పోలేదు. పట్టించుకొనే నాథుడూ లేడు. ఇయ్యన్నీ చూడ్డానికే ఈ పాపిష్టి కండ్లింకా ఉండాయి. ఈ కరువురోజు లొచ్చి పసిబిడ్డల తిండికోసం వాటి నమ్ముకుంటున్నాం. ఆ గొడ్ల మీద దళారి మామూలు తీసుకోని ఎంత బతుకు బతుకుతాన్నాయినా! ఈ బతుకు ఇంకొద్దు నాయినా! నువ్విచ్చే ఆ రూపాయి కూడా గొడ్లు గలోళ్ళకే ఇచ్చేయి. వాళ్ళ పిల్లలకే ఇంకొంచెం తిండన్నా పెట్టుకుంటారు సరే పోదాం రాండి నాయనా" తాత కళ్ళలో నీటిపొరలు తారట్లాడుతుంటే వ్యాపారస్థుల్ని తీసుకొని ఊతకర్రతో ముందుకు కదిలాడు.

తాత ఊళ్ళో గొడ్లున్న వాళ్ళందరిళ్ళకూ వ్యాపారస్థులను పిలుచుకొని పోయి గొడ్లు చూపించి డబ్బు లిప్పించాడు.

వ్యాపారస్థులతో కూడా కలిసి తాత గచ్చు బండ దగ్గరకు వస్తుంటే ఎవరో పిలిస్తే వెనక్కి తిరిగాడు.

"తాతా ఓ తిమ్మయ్య తాతా! నేనే పిలుస్తా ఉండేది ఇట్లోచ్చి పో." పెనుగొండ అచ్చయ్య భార్య నాగమ్మ పిలిచేటప్పటికి తాత ఆమె దగ్గరికి వెళ్ళాడు.

"ఏం కోడలా కర్రావును అమ్మడానికేనా?"

"అవును తాతా! మీ అందరి గొడ్లకు లేని మేవు నేను మాత్రం దానికి యాడ్నించి తెచ్చేది? పిల్లదానికి రెంద్రోజుల్నుంచి జరంగా ఉండాది. దాన్నమ్మితే వచ్చిన డబ్బుల్తో నన్నా దాన్ని ఆసువత్తిరిలో చూపిస్తా తాతా." నాగమ్మ బాధగా చెప్పింది.

"అమ్మాలంటే రాయుడు పడనిస్తాడా? అయినా వాడి సంగతి తెలిసే అంటన్నావా కోడలా?" తాత.

నాగమ్మ కొడుకు రాయుడికి కర్రావు అంటె పంచ ప్రాణాలు. దానికి ఎప్పుడు దూడలు పుట్టినా, కోడె దూడలే గాని పెయ్యలేదు. ఈ సారి పెయ్య పుట్టాలని, పుడితే తిరుపతి కొండకు వస్తానని మొక్కు కూడా మొక్కుకున్నాడు.

"దానికి మేత లేకుండా ఉండేటప్పటికి తలుగు తెంపుకోని యాడికో పోయిందని చెప్పొచ్చులే తాతా" నాగమ్మ చెప్పింది.

పిల్లవాడి మనసు ఎక్కడ బాధ పడుతుందోనని తాత ఆలోచించాడు. కర్రావు అంటే రాయుడికి ఎంత ఇష్టమో తాతకు తెలును, కాని అసలు పరిస్థితి కూడా తెలును కాబట్టి ఏమి చెప్పలేకపోయాడు. సరేనని వ్యాపారస్థుల్ని తీసుకువచ్చి చూపించాడు.

"ఆవు మంచి ఆవే గాని పైగా బిడ్డ బాధపడతడని కూడా అంటున్నారు ఉండనీండమ్మా. మేమిచ్చినా కూడా చాలా తక్కువే గదమ్మా." వ్యాపారి కూడా అంత మంచి ఆవును కసాయికి తోలడం ఇష్టపడలేదు.

"దాన్నమ్మడమంటే నా కొడుకును అమ్మేసినట్లే. కాని ఏం చేసేమన్నా? మేతన్నా ఉంటే సరే ఆ మేతే ఉంటే ఊర్లో ఎవురన్నా అమ్మే వాళ్ళేనా అన్నా?" నాగమ్మ బాధగా అంది.

ఆమె చెప్పింది కూడా నిజమే ననిపించింది వ్యాపారికి.

"సరే నూరు రూపాయలిస్తానమ్మా" అని చెప్పి జేబులో నుంచి డబ్బులు తీసిచ్చాడు.

ఆ డబ్బు తీసుకోవాలంటే నాగమ్మకు చేతులు వణకాయి. చేసేది లేక మౌనంగానే అందుకొంది.

"రేపు మధ్యాహ్నం ఇక్కడికే లారీ వస్తాదమ్మా అపుడు తీసుకపోతాం అంత దాకా ఆవును మీకాడనే ఉండనీండమ్మా" వ్యాపారి చెప్పాడు.


ఆవును అమ్మే సమయానికి కొడుకు లేకపోవడం మంచిదైంది. కాని ఆవును తీసుకపోయే సమయానికి రాయుణ్ణి ఇంటి దగ్గర ఉండనివ్వకుండా పక్క ఊళ్ళో తన అన్న దగ్గరికి పంపించాలని నిర్ణయించుకొంది నాగమ్మ.

** ** **

"రాయుడూ! లెయ్యి నాయినా పనుండాది." నాగమ్మ చీకటుండగానే పూర్తిగా తెల్లారక ముందే కొడుకును లేపింది.

"ఇంకా తెల్లారలా కదా, అపుడే ఎందుకమ్మా?" పడుకునే తల్లికి సమాధానమిచ్చాడు రాయుడు.

అంత పొద్దున్నే లేవాలంటే రాయుడికి మనసొప్పలా, పసిబిడ్డ కాబట్టి కడుపునిండా తిండి లేక



నీరస పడినాడు. రాత్రి కూడా తిండి తినలేదు తాను పిల్లల్తో కలిసి. సాయంత్రంగా కలబందగడ్డ కొట్టుకొస్తే అదే తల్లీ, కొడుకు ఇద్దరూ కలిసి తిన్నారు.

"తొందరగా లేయిరా మీ మామగారి ఊరికి పొయ్యేసి వద్దువు" నాగమ్మ మళ్ళీ లేపింది.

"మొన్ననే కదమ్మా మామోల్లూరికి పోయింది? మల్లా ఇవుడెందుకమ్మా! మాఇంట్లో మాత్రం గింజలెట్టొచ్చినాయి ఇంగ రాబోకండని అత్త కసిరింది" అన్నాడు.

రాయుడికి మేనమామున్నా, మేనమామ ఊరికి పోవడమన్నా ఇష్టమే కాని అత్త గయ్యాళితనం చూస్తే మాత్రం భయపడతాడు.

"ఈ రోజు ఒక్క రోజు పోయిరా నాయినా, అత్తకు తెలీకుండా మామను వది రూపాయలడిగి ఇప్పించుకోని రాపో. అమ్మికి జరం గాని నూదన్నా ఏపించాల. తొందరగారా పో నాయినా" నాగమ్మ కొడుకును బుజ్జగించి చెప్పి పంపించింది.

నాగమ్మ కూడా వదిన గయ్యాళితనం చూసి తన అన్న దగ్గరకు డబ్బు కోసంగా కొడుకును పంపడం ఇష్టం లేదు. కాని ఆ రోజు ఇంటి దగ్గర రాయుడుంటే వ్యాపారస్థులు అవును తీసుకపోయేటప్పుడు అడ్డుపడతాడు. వాణ్ణి కాదని బలవంతంగా తీసుకుపోతే మనస్సును బాధ పరిచినట్లవుతుంది. అందుకని డబ్బు సాకుతో రాయుణ్ణి తన అన్న దగ్గరికి పంపింది. మధ్యాహ్నం అన్నం అక్కడే తిని సాయంత్రంగా రమ్మని మరీ చెప్పి పంపించింది. రాయుడు పోయిన కొద్ది సేపటికి గొడ్లను తీసుకుపోయే లారీ కూడా రానే వచ్చింది.

లారీని చూసినవ్పటి నుంచీ నాగమ్మకు వణకు పుట్టింది. గొడ్ల కొట్టంలోకి పోయి అవును తేరిపార చూసింది. వీపు మీద చేత్తో నిమిరింది. దుఃఖం ఎంతగా ఆవుకున్నా ఆగలేదు.

"నీకూ, మాకూ ఈ రోజుతో ఋణం తీరిపోతోంది కర్రే" అని ఆవు మెడను వాటేసుకొని భోరుమని ఏడ్చేసింది. కర్రావుకు ఏమర్థమైందో ఏమో మెడను ముందుకు చాచి, మోర పైకెత్తి నాగమ్మ భుజం మీద తన గొంతును ఆన్చింది చేతుల మీద నాలికనద్ది జొల్లు కార్చింది. నాగమ్మకు మనసు నిలకడగా లేక ఇంట్లోకీ, బయటకూ లెక్క లేనన్ని సార్లు తిరిగింది.

గొడ్లనన్నిటినీ లారీకి ఎక్కించేటప్పటికి మధ్యాహ్నమైంది. ఊరి జనమంతా లారీ దగ్గర మూగిపోయారు.

"ఏయ్ బోడి దానా, సొట్ట కొమ్ములో" అంటూ చిన్న పిల్లలు వాళ్ళ గొడ్లకు పెట్టిన పేర్లు పిలుస్తున్నారు. అవి లారీ లోపలి నుంచి మోరలు పైకెత్తి అరుస్తున్నాయి.

బంధువులను రైలెక్కించి వీడ్కోలు చెబుతున్నట్లు ఊళ్ళో వాళ్ళ గొడ్లవైపే చూస్తున్నారు. గొడ్లు కూడా ఇదే కడసారి చూపని గుర్తించాయేమో తమ యజమానుల వైపు తదేకంగా చూస్తున్నాయి.

నాగమ్మ కూడా కన్నార్పకుండా కర్రావు దిక్కు చూస్తూ నిల్చుంది. కర్రావు నాగమ్మ దిగులును చూసి చెవులాడించి మోర పైకెత్తి 'అంబా' అని అరిచింది. నాగమ్మకు అంత వరకూ అవుకున్న దుఃఖం మరి ఆగిందికాదు. కట్టలు తెగిన నదిలాగా దూకింది. లారీ దగ్గరికి వరుగెత్తేటప్పటికి అది కూడా అప్పుడే కదిలింది. నాగమ్మ ఏడుస్తూ అక్కడే కుప్పలా కూలిపోయింది. తిమ్మయ్య తాత నాగమ్మను పైకి లేవనెత్తి ఓదారుస్తూ ఇంటికి తీసుకొచ్చాడు.

"పెద్ద దానివి నువ్వే ఇంతగా ఇదైపోతే, ఇంక వసిబిడ్డ రాయుడికి తెలిస్తే వాడెంత బాధవడ్తాడు కోడలా? నువ్వట్టా దిగులు పడకూడదమ్మా. గుండెను కటువు పరుచుకోవాల. ఈ రోజు గొడ్లను కసాయికి తోలినందుకు మన ప్రాణాలు గిజగిజలాడ్తన్నాయి. ఇంక బెమ్మంగారు చెప్పినట్టు ఈ కరువు ఎంతకూ తీరక మన కళ్ళెదుటే బిడ్డలు ప్రాణాలు పోకా, రాకా కొట్టుకుంటా ఉంటే ఆ గోడు చూడలేక మనమే గొంతు పిసికి చంపాల్సొస్తాదేమో కోడలా! మనం చేయదగిందేమీ లేదు. ఎట్ట జరగాల్నో అట్టా జరిగి తీరాల. కలరా నన్నా భరించొచ్చునేమో కాని కరువు బతుకు బరించలేం. కాని కట్టాలు మనిషికే కాని మాకు రావంటారు. కాబట్టి మనమే బరించాలమ్మా! బరించి తీరాల!" తిమ్మయ్య తాత చాలా సేపు నాగమ్మకు ధైర్యం చెప్పి ఇంటికెళ్ళాడు.

నాగమ్మ గొడ్ల కొట్టంలో కెళ్ళింది. పేడ కలిసిన వాసన ముక్కులకు తగులుతూ ఉంటే ఆవును అమ్మినట్లే అనిపించలా. మేతకు పోయి సాయంత్రానికి వస్తుందిలే అనిపించేట్టుగానే ఉంది.

'ఎంత పాపం సేసుంటే కాని, చేతులారా కసాయోడికి ఆవును తోలే కర్మ దాపురించిందో కదా' అని మనసులో అనుకొంది నాగమ్మ.

ఆవు పంచితం ఇక దొరకదని ఉదయాన్నే పట్టి పెట్టింది. దాన్నే ఇల్లంతా చిలకరించింది. 'పాపం కొట్టుకోకుండా గో హత్య తగలకుండా చూడు దేవుడా' అని ప్రార్థించింది.

నాగమ్మ మనసంతా ఆవుమీదే. అన్నం కూడా వండ బుద్ధి పుట్టక వాకిట్లో దిగులుగా ఆలోచిస్తూ అలాగే కూర్చుంది. తన మనసుకే ఇంత బాధగా ఉంటే ఇక వసిబిడ్డకు తెలిస్తే వాడెంత బాధపడతాడో కదా అనుకొంది.

* * *

రాయుడు మామ గారి ఊరెళ్ళి ఇంటి దగ్గర తన మామ లేడని తెలిసి, అత్తకు కూడా తన ముఖం చూపించకుండా వెంటనే ఇంటి దారి మళ్ళాడు.

రాయుడు మట్టి రోడ్డుపై నుంచి తారు రోడ్డు మీదకు వచ్చేటప్పటికి రోడ్డు మీద గొడ్ల లారీని నిలబెట్టుకొని వ్యాపారస్థులు టీ తాగుతున్నారు. రాయుణ్ణి దూరం నుంచి చూసి కర్రావు లారీలో నుంచి పిలుస్తున్నట్లు 'అంబా' అని అరిచింది.

కర్రావు అరుపును గుర్తించి లారీ వైపు చూపు సారించాడు రాయుడు. కర్రావు కనవడగానే ఆశ్చర్యమేసి అది లారీలోకి ఎట్లా ఒచ్చిందో అర్థం గాక లారీ దగ్గరికి పోయి చూడాలని పరుగెత్తాడు. దగ్గరి కెళ్ళేటప్పటికి లారీ కదిలిపోయింది. ఆవు 'అంబా, అంబా' అంటూ అరుస్తూనే వెళ్ళింది. అరుపు దూరమయ్యే దాకా అట్టాగే నిల్చొని లారీ కనుమరుగవగానే ఇంటికి పరుగుతీశాడు.

రాయుడు ఇల్లు చేరేటప్పటికి మధ్యాహ్నమైంది.

"అమ్మా...అమ్మా" అంటూ రాయుడు గస మీద వచ్చాడు. రాయుడి పిలుపూ, ఆత్రతా చూడగానే నాగమ్మ గతుక్కుమంది.

"ఎందుకురా గస పెట్టుకుంటూ పరిగెత్తినావు? ఏమైంది?" నాగమ్మకు ఏం జరిగిందో అర్థం గాక

## బి.ఎన్. సుభాషితాలు

జీవిత మనే పరుగు పందెంలో
బోల్తాపడేలా పరుగెత్తకు
ఎంత దూరం పరుగెత్తినా
చివరి మజిలీ సమాధివరకే—మజిలీ

అష్ట ఐశ్వర్యములున్నా
అనంతమైన శక్తి సామర్థ్యములున్నా
అంతఃకరణశుద్ధి లేకపోతే
శృంగభంగము తప్పదన్నా—

కోటి పడగెత్తే ఈ ప్రపంచంలో
కోట్లకు కోట్లు సంపాదించాలని పరుగెత్తకు
సంపాదించే ప్రతి కోటికీ
కోటొక్క కష్టాలున్నవని తెలుసుకో—

సిరులు వెదజల్లు ఒక చిరునవ్వు
తేనె లొలుకు ఒక చిన్న పలుకు
మురిపించు నెంత ముఖావినైన
కరిగించు నెంత కఠినాత్ముడినైన—

స్వేచ్ఛను కోరే స్వేచ్ఛా జీవులారా
స్వేచ్ఛ అందరి హక్కని తెలుసుకొండి
మీ స్వేచ్ఛకు హద్దు లేర్పరుచుకొండి
మోతాదును మించితే—మధువే విషమై
అమృతమైనా హాలాహలమై
ప్రాణసంకటం కాగలదని తెలుసుకొండి—

అంతులేని ప్రజాబలంతో
అధికారంలోకి వచ్చినా
అహంభావం ఎక్కువైతే
అది మూడునాళ్ళ ముచ్చటే—

చెప్పులేవని ఏడ్చేవాడికి
కాళ్ళులేనివాడు కనిపించేవరకు
అర్థం కాలేదట-తా నెంత
అదృష్టవంతుడో—

మంత్రివర్యులారా—శభాష్
ప్రగతంటే మీది
నిన్నటివరకు ఎక్కడున్నారో తెలియని మీరు
అమాంతం అందలం ఎక్కి కూర్చున్నారు—

—వాస్తుశిల్పి బి.ఎన్. రెడ్డి

ఆందోళనగానే అడిగింది.

"మన కర్రావును ఎవురో లారీలో కెక్కించుకొని పోయినారమ్మా" వచ్చినంత ఆత్రంగానే గబగబ చెప్పాడు.

ఆ మాట వినగానే నాగమ్మకు పై ప్రాణం పైనే పోయినట్లైంది. అంతలోనే ఏమీ తెలియనట్లు నెమ్మదిగా అయింది.

"మనావును ఎవురు పట్టుకొని పోతార్రా? ఇప్పుడు దాకా ఇంట్లో ఊరికే మేత కోసం అల్లాడుతా ఉంటే నేనే. ఉండబట్టక తలుగిప్పి తరిమినాలే. సాయంత్రానికి వస్తాది" జరిగింది చెప్పకుండా దాచింది.

రాయుడికి నమ్మ బుద్ధి గాక గొడ్ల కొట్టం దగ్గరకు పోయి అనుమానంగా చూస్తూ నిలబడ్డాడు. కొడుకు అనుమానపడడం చూసి వాడికెక్కడ నిజం తెలిసిపోతుందో అని నాగమ్మ భయపడింది. అంతలోనే కోపంగా చూస్తూ "అయినా వస్తే రానీ లేకుంటే అట్లైట్లన్నా పోయి చావనీలే, దానరువులూ, గోడూ చూడలేము. మనకే తిండి లేక చస్తున్నాము ఇంగ దానికేడ నుంచి తేవాల మేత?" కటువుగా అంటే వాడి మనసు మారుతుంది అనుకొంది నాగమ్మ.

రాయుడికి తల్లి మాటలు వినగానే దిగులు పుట్టింది. ముఖమంతా నల్లగా తయారైంది. ఏం మాట్లాడకుండా అరుగు మీద పడుకున్నాడు. నాగమ్మ కొడుకు పరిస్థితి గమనిస్తూ ఇంట్లోకీ బయటకూ తెగ తిరిగింది. వాడి కంతకన్నా ఇంకేం చెప్పాలో ఆమె కర్థం కాలేదు.

"రాయుడూ నువ్వింటి కాడనే ఉండురా, నేను అమ్మిని తీసుకోని పోయి సూదేపిచ్చుకోనొస్తా" అని చెప్పి బిడ్డ నెత్తుకొని, గొడ్డు నమ్మగా వచ్చిన డబ్బును తీసుకొని ఆసుపత్రికి బయలుదేరింది.

* * *

చెల్లెలిని తీసుకొని అమ్మ ఆసుపత్రికి బయలు దేరిపోగానే రాయుడు ఇంటి వాకిలేసి చిలుకు పెట్టి వీథిలోకి వచ్చాడు.

"రాయిలన్నా, రాయిలన్నా" అంటూ మల్లికార్జునుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

మల్లికార్జునుడు రాయుడి పెద్దమ్మ రాజమ్మ కొడుకు. రాయుడి తండ్రి అచ్చయ్యతో పాటు మల్లికార్జున తండ్రి యానాదయ్య కూడా కూలి పని కోసం ఊరు విడిచి పోయాడు. మల్లికార్జునుడు రాయుడి దగ్గరకొచ్చి "రాయిలన్నా పొద్దనేడికి పోయినావన్నా ఊర్లో లేకుండా?" అన్నాడు.

ఉదయం లారీలోకి గొడ్ల నెక్కించిన సంగతి అవి పొయ్యేటపుడు ఊళ్ళో వాళ్ళు ఏడవటం రాయుడి తల్లి కింద పడిపోయిన విషయాలు అన్నీ వివరంగా చెప్పాలని మల్లికార్జునుడు ఆత్రుత పడుతున్నాడు.

"మల్లిగా ఈ పొద్దు మీ దున్నపోతుల్ని కూడా మేతకు ఒదిలినారారే?" రాయుడడిగాడు

గొడ్లను అమ్మిన సంగతి రాయుడికి తెలీదని తెలుసుకున్నాడు.

"రాయిలన్నా మా దున్నపోతుల్నీ కూడా అమ్మేసినల్లా? నీకు తెలీదో!" అన్నాడు. "మాయి దున్నపోతులూ, మీది కర్రావూ, ఊర్లో అందరియి అమ్మేసినారు, పొద్దన నువ్వు లేవు కదా! లారీలో అన్నిట్నీ ఎక్కిచ్చి తీసుకపోయినారు. అందురూ బలే ఏడ్చినారన్నా! మీ అమ్మ కూడా నేల మీద పడి ఏడ్చింది." మల్లికార్జునుడు ఉదయం లారీ దగ్గర జరిగినదంతా వివరించాడు.

రాయుడికి మల్లికార్జునుడు చెప్పింది వినగానే ఉదయం రోడ్డు మీద లారీలో ఆవును చూడడం, అది తనను చూసి అరవడం అన్నీ కళ్ళ ముందు కదిలాయి. కర్రావును అమ్మేశారని తెలియగానే కళ్ళు మబ్బులు కమ్మి స్పృహ తప్పిపోయాడు.

"రాయిలన్న పడిపోయినాడు, చచ్చిపోతన్నాడు" మల్లికార్జునుడు భయపడి అరవగానే జనమంతా రాయుడి చుట్టూమూ గారు. ముఖం మీద నీళ్ళు చల్లగానే రాయుడు నీరసంగా కళ్ళు తెరిచి అందరివైపూ పిచ్చి చూపులు చూశాడు.

"నా కర్రావును అమ్మొద్దు. కర్రావును అమ్మబోకండి. కర్రావు కావాల" గట్టిగా అరిచి కాసేపటికి మళ్ళీ స్పృహ తప్పాడు. రాయుడ్ని ఎత్తుకొచ్చి ఇంట్లో మంచం మీద పండబెట్టారు.

నాగమ్మ ఆసుపత్రిలో బిడ్డకు చూపించి బజారులో ఉప్పు, మిరపకాయలు, బియ్యం తీసుకొని ఇంటి కొచ్చింది. ఇంటి ముందు జనాన్ని చూసి భయపడిపోయింది.

"వాళ్ళమ్మ వస్తాంది పక్కకు పోండి" చుట్టూ ఉండే వాళ్ళను హెచ్చరించారెవరో.

మంచంలో బిడ్డను చూసి చేతిలో సంచీ వదిలేసింది నాగమ్మ. ఎవరో చంకలో ఉన్న బిడ్డను కింద పడనీకుండా లాక్కున్నారు. "రాయుడా" అంటూ వెర్రరువు అరిచి బిడ్డ మీద వాలిపోయింది నాగమ్మ.

చెల్లెలిని ఓదారుస్తూ రెక్క పట్టి పైకి లేపింది రాజమ్మ.

"రాయుడికేం కాలేదులే గమ్మునుండు కోడలా!" అరిచాడు తిమ్మయ్య తాత.

"కడుపులో ఏమీ ఆలీ లేనట్టుంది. కండ్లేమో తిరిగి కిందపడినాడు. అంతే ఇంకేం జరగలేదు మీరు ఊరికే ఏడ్వగాకండి. పిల్లోడు మరీ భయపడి పోతాడు." తాత నాగమ్మను సముదాయించాడు.

నాగమ్మ కొద్ది సేపు మౌనంగా ఉండి ఏదో జ్ఞాపకం వచ్చి తాత వైపు చూసింది. "తాతా, రామారావు గవరమెంటుకు చెప్పి మన గొడ్ల కోసమని రైల్లల్లో ఒరిగడ్డి పంపించినాడంటనే, మనం పోయి తెచ్చుకోనుంటె, మన గొడ్లను కూడా అమ్మకుండా ఉండిందుము కదు తాతా" టౌన్‌లో ఎవరో చెప్పుకోగా వినిన దాన్ని బాధగా చెప్పింది తాతతో.

"అయ్యో పిచ్చి తల్లీ!" ఆ రామన్న పంపించే గడ్డి మన లాంటోల్లకే అయితే మనం గొడ్లను ఎందు కమ్ముకుంటాం కోడలా అక్కడెవురో ఆయనకు దానం చేస్తే ఆ గడ్డే రైల్లో వచ్చింది. ఆ వచ్చిన గడ్డి పేదోల్ల గొడ్ల కోసం కాదు కోడలా, మన పెదరెడ్డేరి లాంటి బూస్వాముల కోసం కానమ్మా! ఈ రామన్నకే మన పైన దయుంటే మనమెందుకు ఊర్లొదిలి "పాలోరామన్నా" అంటూ పోతాం కోడలా! అది పేదోల్లకు సాయం కాదమ్మా! పెద్దోళ్ళ మాయ కోడలా, ఇంక ఆ ఊసొద్దులే మర్చిపో" తాత చాలా సేపు ఓదార్పు మాటలు చెప్పి వెళ్ళిపోయాడు.


రాయుడు కళ్ళు తెరిచి బాగా మాట్లాడిన తరువాత చెల్లెలిని ఏడవకుండా ధైర్యంగా ఉండమని చెప్పి ఇంటి కెళ్ళింది రాజమ్మ. రాయుడు కళ్ళు తెరచి కొద్ది సేపు బిక్కిరి చూపులు చూసి కళ్ళలో నీళ్ళు కార్చుకుంటూ అట్లే నిద్రకు పడ్డాడు. కరువు పెట్టే కష్టాలు తలుచుకుంటూ నాగమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది.

"ఇప్పుడు ఇంట్లో తన భర్త ఉంటే బాగుండు. తిన్నా తినకున్నా అందరూ ఒకే చోటుంటే చింత ఉండదు. అయినా ఎక్కడుండాడో ఏమో, తింటున్నాడో, పస్తున్నాడో" అని భర్త మాట తలుచుకొని మరింత దుఃఖించింది.

తెచ్చిన బియ్యం వండి పిల్లదానికి కొంచెం తినిపించింది. తనకు తినడానికి మనసొప్పక అలాగే ఉండిపోయింది. రాయుణ్ణి లేపుదామని మంచం దగ్గర కొచ్చి ఒంటి మీద చేయి వేసి కొయ్య బారినట్లు నిలబడింది. రాయుడి ఒళ్ళంతా కాలిపోతూ ఉంది. జ్వరం బాగా ఉంది.

"కర్రావును పట్టుక పోతన్నారమ్మా, కొడ్తన్నారు, దాన్ని కొట్టొద్దనమ్మా. ఒద్దమ్మా దాన్ని అమ్మొద్దమ్మా." ఆవు గురించి జ్వరంలో కలవరింతలతో అరుస్తున్నాడు రాయుడు.

'ఆవు మీద వాడి కుండే ఇష్టం తెలిసి కూడా దాన్నమ్మి వాడి మనసును పాడు చేసినా—పాపిష్టిదాన్ని' అనుకుంటూ ఏడవ



సాగింది నాగమ్మ.

* * *

కణకణ మండే కాలే ఎండలో పగటి పూట కడుపు మాడుస్తున్న కరువు కష్టాల కన్నీటి బాధలకు కా సేపు విశ్రాంతిని ఇచ్చినట్లు చీకటి దట్టంగా కమ్మింది. రాత్రి పూట కష్టాలను తలుచుకుంటూ మౌనరోదనలో ఊరి జనం కన్నీరు కార్చి కార్చి కన్ను మూసి కునుకు పట్టారు. ఊరంతా చీకట్లో సద్దు మణిగింది. నాగమ్మకు నిద్ర పట్టక బిడ్డ దగ్గర మంచంలోనే గొంతు క్కూర్చుంది.

"ఏమమ్మే నాగమ్మా ఇంకా నిద్రపోలా? బిడ్డ కెట్టుండాది" రాజమ్మ చెల్లెలిని పలకరించి మంచం కింద కూర్చుంది.

"ఏమో అక్కా వాడ్ని చూస్తా వుంటే నాకు బయంగా ఉండాది. ఒల్లంతా కాలిపోతాంది. ఆవు నమ్మొద్దని కలవరిస్తున్నాడు. ఆవు నమ్మకున్నా బాగుండక్కా" నాగమ్మ కళ్ళనీరు పెట్టుకొంది.

"ఏడ్వకు, వాడు దిగులు పడతాడు. జరమే కదా ఏమి చేస్తాదిలే పోతాది. అచ్చయ్య ఏమన్నా జాబు రాసినాడా నాగమ్మా. ఎక్కడుండాడో తెలిసిందా?" రాజమ్మ అడిగింది.

"పది రోజులప్పుడు జాబు రాసినాడక్కా తిరుపతిలో రోడ్డుపని చేస్తన్నారంట. పనిచేసి రాత్రి పూట రైల్టేషన్‌లో పండుకోనుంటే పోలీసోల్లొచ్చి పట్టుక పోతన్నారంటక్కా. ఈల్తో పాటు ఉండే వాల్లల్లో ఇద్దర్ని పట్టకపోయి దొంగతనం కేసు పెట్టి జైల్లో తోసినారంట, తిరపతిలో ఉండాలంటే భయంగా ఉండాది అని రాసినాడక్కా. మల్లేం జాబు గీబు ఏమి రాయలా! ఎమన్నా అయిందో ఏమో అని నాకు అదొకపక్క దిగులుగా వుండాదక్కా"

నాగమ్మ భర్త విషయం దిగులుగా చెప్పింది. కొద్ది సేపు ఇద్దరూ ఏం మాట్లాడు కోకుండా మౌనంగా ఉండిపోయారు.

"యానాది మాకు సంగతి మా ఇంటాయన కూడా జాబులో రాయిలా యాడుండాడక్కా" నాగమ్మ రాజమ్మను అడిగింది.

"నీకు ఆ సంగతే చెబుదామని వచ్చినా, మరిసిపోయినా నమ్మే" రాజమ్మ అంది.

"ఎక్కడుండారటక్కా" నాగమ్మ ఆత్రుతగా అడిగింది.

"కోడూరు కాడ మంగంపేటలో ముగ్గురాళ్ళ గనిలో పనిచేస్తున్నారంటమ్మే. రాళ్ళు కోసుకొని బాగా దెబ్బలు తగిలి పుండ్లవుతున్నాయంట. అయినా పరవాలేదు. పని దొరుకుతాందంట. మమ్మల్ని కూడా రమ్మని చెప్పి రాసినాడు నాగమ్మా. పొద్దున్నే రైలు బండికి పోదామనుకుంటన్నాం. ఆ సంగతి నీకు చెబుదామని వచ్చినానమ్మే" రాజమ్మ వివరించింది.

"అట్టయితే మీరు పోయినాక మాకు సడిగి బాగా పని దొరికేటట్లైతే జాబు రాయండక్కా. మేము కూడా మా ఇంటాయనకు చెప్పి అక్కడికే వచ్చేస్తాం. ఆ పని చేసి వున్నాం కట్టుకో అక్కా. తిండి తిన్నా, తినకపోయినా అందరం ఒకేచోట పడుంటాం అక్కా" నాగమ్మ రాజమ్మను బ్రతిమలాడినట్లుగానే చెప్పింది.

"దానికేముందమ్మే? మీరు కూడా వుంటే అందరం తోడుగా సన్నా ఉంటాం పోతానే జాబు రాపిస్తానులేమ్మే." రాజమ్మ చెల్లెలుకు చెప్పి వెళ్ళిపోవడానికి లేచింది.

"మరిసి పోగా కక్కా మీతో పాటు మేము కూడా ఒక పూట తింటాం" అక్కకు పొయ్యేటప్పుడు మళ్ళీ గుర్తు చేసింది నాగమ్మ.

"నువ్వంతగా చెప్పాల్నా నాగమ్మా, నాచెల్లెలి బతుకుపైన నాకు మాత్రం బెంగుండదాయేం? నువ్వేం దిగులు పెట్టుకోగాకు పోతానే జాబు రాపిస్తా వచ్చేద్దుర్లే" అని చెల్లెలికి చెప్పి రాజమ్మ వెళ్ళిపోయింది.

రాయుడు నిద్రలో గొణుగుతూ పక్క వైపు నుంచి వెల్లకిలా తిరిగాడు. "ఏయ్ కర్రా దా...దా.... అమ్మా మన కర్రావుకు కడుగు నీళ్ళు తీసుకొనిరా తొందరగా రామ్మో" కలవరించాడు.

కా స్సేపు తర్వాత మళ్ళీ కలవరించడం మొదలు పెట్టాడు. "కర్రావును తీసుకపోతన్నారు పట్టుకోండి-పట్టుకోండి. వద్దమ్మా అమ్మకమ్మా!" అని ఏడుస్తూ పైకి లేచాడు రాయుడు.

"అమ్మా కర్రావును అమ్మేసినావు కదమ్మా! ఇంక రాదమ్మా మన ఆవు రాదు కదో!" కళ్ళు తెరచి తల్లితో బాగానే మాట్లాడాడు.

"లేదు నాయినా, అమ్మ లేదురా నువ్వు పెయ్యదూడ పుట్టాలని కొండకు మొక్కునిల్లా—అందుకని ఆవు దేవుడి కాడికి పోయింది నాయినా. మన దగ్గర మేపు లేదని ఆడికి పోయింది. మల్లా వస్తాదిలే రాయుడూ."

నాగమ్మ బాధను ఆపుకుంటూ చెప్పి కొడుకును మంచం మీద పడుకోబెట్టింది.

* * *

అర్ధరాత్రి దాటుతున్నా నాగమ్మకు కంటిమీద రెప్ప వాలలేదు. నిద్ర లేకుండా కొడుకు పక్కలో అట్లానే గొంతు క్కూర్చుంది. కళ్ళనుండి కారిన వేడి చుక్కలు కాలుతున్న రాయుడి ఒంటి మీద పడి మాడిపోయినట్టు ఇంకిపోయాయి.

'నిప్పులై మెరుస్తున్న రాళ్ళమీద గడ్డి కూడా కనిపించక మాడిపోయిన ఎడారి సీమ ఎర్రదుమ్ము నేల మీద కొంచెమన్నా కనికరించి "గంగ తల్లి" కన్నీటి చుక్కలను రాల్చి గడ్డి మొలకలన్నా మొలిపించుంటే, నీ కర్రావును నేను కసాయికి తోలుండక పోదునురా నాయినా. ఆ గంగ తల్లికీ కరుణ లేదు! రాజ్యమేలే మ్మారాజుల గుండెలూ కరగలా, ఆకిరికి కసాయి వ్యాపారులే కనికరించి నాలుగు రూకలిచ్చినారు. నువు ప్రాణంగా చూసుకోనే 'ఆవే' కసాయి కరువుకు పానాలిచ్చి నీ చెల్లెల్ని కాపాడింది. ఇంకా నాలుగు రోజులుండేట్టుగా మన ప్రాణాల్ని నెలబెట్టింది,రాజ్యమేలే పాపిష్టి మనుసుల కన్నా గొడ్డే మేలురా!' అని నాగమ్మ మనసు మూగగా రోదిస్తూనే ఉంది. ★

